
ప్రజాశక్తి
ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | 5 | తూర్పుగోదావరి



శిరోముండనం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి – సీతానగరం

కట్టుకున్న భార్యను విచక్షణ రహితంగా కొట్టి శిరోముండనం చేసిన కేసులో భర్త కర్రి రాంబాబును పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో నిందితుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. బాధితురాలు ఆశను రాజమండ్రి ఆసుపత్రిలో వైద్య చికిత్స అనంతరం జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ పీడీ విజయ కుమారి ఆదేశాల మేరకు రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం స్త్రీ పునరావాస కేంద్రానికి తరలించారు. నిందితుని కఠినంగా శిక్షించాలని టిడిపి నేత బద్ద బాబూరావు డిమాండ్ చేశారు. సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. బాధితురాలు ఆశకు అండగా ఉంటామన్నారు. ఈ ఘటనలో నిందుతునికి గ్రామంలో వైసిపి నాయకులు అండదండలు అందించారని ఆరోపించారు.

ద(మె)గా డిఎస్‌సి..!!

- అరకొరగా డిఎస్‌సి పోస్టుల భర్తీ
- నిరాశలో నిరుద్యోగులు
- కంటితుడుపు చర్యలే అంటున్న యువత

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి యువత ఉపాధి కోసం అనేక హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కోసం మెగా డిఎస్‌సిని విడుదల చేస్తామని ప్రకటనలు గుప్పించారు. తీరా ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన జగన్ సచివాలయ ఉద్యోగుల మినహా ప్రభుత్వ శాఖల్లో ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపానపోలేదు. ఎన్నికలకు ముందు డిఎస్‌సి అంటూ ప్రకటన ఇచ్చి మరోసారి ఆశలు రేపారు. తీరా ప్రకటించిన డిఎస్‌సిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో కోతలు పెట్టడం నిరుద్యోగులను తీవ్ర నిరాశలోకి నెట్టారు.

మెగా దగా

ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. తీరా సీఎం అయ్యాక ఆ హామీనే మరిచారు. అధికార పగ్గాలు చేపట్టి ఐదేళ్ళు పూర్తికావస్తున్న తరుణంలో మరోసారి నిరుద్యోగుల ఓట్లను కొల్లగొట్టుకునేందుకు 6,100 పోస్టుల భర్తీకి డిఎస్‌సిని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిఎస్‌సి పేరుతో తమను మరోసారి దగా చేస్తున్నారని మండిపడుతున్నారు. రాష్ట్రంలో 21 వేలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 2 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అయితే జగన్ సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా కేవలం 6,100 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు మమ అనిపించేలా కేబినెట్‌లో నిర్ణయించారు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్ఎ మొదటి లాంగ్వేజ్ 44, సెకండ్ లాంగ్వేజ్ 7, ఎస్ఎ ఇంగ్లీష్ 38, ఎస్ఎ మాథ్స్ 15, ఎస్ఎ పిఎస్ 4, ఎస్ఎ బిఎస్ 15, ఎస్ఎ ఎస్ఎస్ 12, ఎస్ఎ పిఇ 102 మొత్తంగా 237 పోస్టులను ఈ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నారు. మెగా డిఎస్‌సి అంటూ ఐదేళ్ళుగా నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం జిల్లాలో కేవలం తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్లు ప్రకటించి ఉసూరుమనిపించింది. గడిచిన ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించకపోవడంతో కనీసం ఎన్నికల ముందైనా 20 వేల పోస్టులు భర్తీ చేస్తుందని నిరుద్యోగులు ఆశించారు. జిల్లాలో కనీసం 1500 పైనే పోస్టులు భర్తీ అవుతాయని భావించారు. అయితే డిఎస్‌సి అభ్యర్థుల ఆశలపై నీళ్ళు చల్లేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏటా 6 వేల ఖాళీలను భర్తీ చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన జగన్ ఐదేళ్లకు కలిపి 6,100 పోస్టులను భర్తీ చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. వేలాది మంది నిరుద్యోగులు డిఎస్‌సిపై ఆశలు పెట్టుకుని రూ.వేలల్లో డబ్బులు ఖర్చు చేస్తూ కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కానీ అనుకున్న స్థాయిలో డిఎస్‌సి ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్ ఫోటో)

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహం అందించేందుకు ఆడుదాం ఆంధ్రా గొప్ప సువర్ణ అవకాశం అని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా సంబరాల ముగింపు వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 26న ఆర్ట్స్ కళాశాలలోనే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహించడంలో రెండు అంశాలు గమనించాల్సి ఉందన్నారు. ఒకటి రాష్ట్రంలోని యువకిత క్రీడల్లో ఉన్న ప్రతిభ గుర్తించడం, రెండు పిల్లల్లో శారీరక దారుఢ్యాన్ని పెంచి ఆరోగ్యవంతంగా ఉంచడం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత వారి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. యువతీ యువకులు క్రీడలను తమ దినచర్యలో భాగంగా మార్చుకోవాలని, ఆ మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం ఇవ్వాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళ క్రీడాకారులకు ప్రత్యేకంగా క్రీడలు నిర్వహించేందుకు కషి చేస్తామన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తితో విశాఖపట్నంలో ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు జరిగే పోటీల్లో పాల్గొని, జిల్లాకు పతకాలు సాధించి పెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పోటీల్లో విజేతలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు పురస్కారం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణలో జాయింట్ కలెక్టర్, స్పోర్ట్స్ అధికారులు, ఇతర సమన్వయ కమిటీ అధికారుల భాగస్వామ్యం అభినందనీయం అన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్, బీచ్ వాలీబాల్ క్రీడాకారిణి వై.లలితా దేవి, టెన్నిస్ క్రీడాకారుడు పి.శివాజీ, ఫుట్ బాల్ క్రీడా కారుడు కె.రాజేష్, జిల్లా క్రిడాధికారి డిఎం.శేషగిరి, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి-కడియం

రాజానగరం, రంగంపేట, అనపర్తి, రాజమహేంద్రవరం, రాజమండ్రి రూరల్, బిక్కవోలు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు కడియంలో నిర్వహిస్తున్న 'అనుకరణ శిక్షణ' తరగతులను జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సుభాషిణి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ నిత్యం విద్యార్థులకు ఉపయోగపడే విషయాలు, బోధనలో వస్తున్న మార్పులు తెలుసుకుంటూ ఉండాలని, మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఐఎఫ్‌బి.బోర్డులు, టాప్స్, దీక్ష యాప్, ఈ–కంటెంట్ సమాచారం విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. శిక్షణా తరగతులలో భాగంగా శనివారం ఫిజికల్ సైన్స్‌కు చెందిన 90 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని, శుక్రవారం మ్యాథమాటిక్స్‌కు చెందిన 150 మంది శిక్షణ తీసుకున్నారని, ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతున్నాయని, సోమవారం బయాలజికల్ సైన్స్‌కు చెందిన వారికి తరగతులు జరుగుతాయని ఎంఇఒలు లజపతిరాయ్, నాగేశ్వరావు తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న సుభాషిణి

ఫొటోగ్రఫీ ఆధునిక సాంకేతికతపై అవగాహన

ప్రజాశక్తి-నిడదవోలు

ఫొటోగ్రఫీలో ఆధునిక సాంకేతికతపై పట్టణంలోని ఎస్‌కెఎస్ ఫంక్షన్ హాల్లో శనివారం ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూజి ఫిల్మ్ మెంటర్ షేక్ హుస్సేన్ నూతనంగా వచ్చిన కెమెరాలకు సంబంధిచి టెక్నాలజీ గురించి ఫోటోగ్రాఫర్స్‌కు వివరించారు. ఈ పోటీ ప్రపంచంలో లేటెస్ట్ కెమేరాలు, వాటిలో ఉన్న ఆప్షన్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేడ పూర్ణచంద్రరావు, కార్యదర్శి షేక్ సిరాజుద్దీన్, గౌరవాధ్యక్షుడు ఎన్‌వివి.రమణ, ఉపాధ్యక్షుడు ఎన్.రాజు, గౌరవ సలహాదారులు కట్టా సుధాకర్, ట్రెజరర్ ఎం.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ ఎ.నరేష్, యు.శ్రీను పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పూర్తి కాని ఇరిగేషన్ ప్రాజెక్టులు

ప్రజాశక్తి-గోపాలపురం

వైసిపి ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో లక్షలాది ఎకరాల పంట పొలాలకు నీరు అందడం లేదని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఆరోపించారు. శనివారం మండలంలోని గుడ్డిగూడెం వద్ద గల చింతలపూడి ప్రాజెక్ట్ స్టేజ్ టు పంపు హౌస్‌ను దేవినేని ఉమా, టిడిపి నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సుమారు పది లక్షల ఎకరాలకు నీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు రూ.5000 కోట్ల నిధులు మంజూరు చేసి అప్పట్లోనే రూ.4,101 కోట్లు ఖర్చు పెట్టి పట్టిసీమ వద్ద 7 వేల క్యూసెక్కుల నీరు తోడేందుకు పంపు హౌస్ నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు పది లక్షల ఎకరాల వరకు నీరు అందించడం ద్వారా బీడు భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. టిడిపి హయాంలో 72 శాతం పోలవరం పనులు పూర్తయినప్పటికీ ఈ వైసిపి ప్రభుత్వం మిగిలిన పనులు నేటికీ పూర్తి చేయలేక పోయిందన్నారు. కేవలం ఇరిగేషన్ రంగంలో నిధులు ఖర్చు చేసిందల్లా మెయింటినెన్స్‌కు జీతాలకు మాత్రమే ఖర్చు చేసుకున్నారని అన్నారు. పురుషోత్తపట్నం, దేవీపట్నం పంపు హౌస్‌లకు తాళాలు వేశారని, తెలుగు గంగ గాలేరు పట్టిసీమ, స్వర్ణ యుగం ఇరిగేషన్ రంగం పనులు ఆగిపోయాయని అన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే రెండు పంటల నుండి మూడు పంటల వరకు పంటలు పండుతాయని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం ఇరిగేషన్ పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 10 నియోజకవర్గాలలో అందించవచ్చని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఇరిగేషన్ పనులు నిలుపుదల చేయడం వల్ల ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందడం లేదని అన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈలి శరత్‌బాబు, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీనివాస్, మద్దిపాటి రమేష్ ఉన్నారు.



ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

4న ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఈ నెల 4న ఎపటిఎఫ్ జిల్లా శాఖ జనరల్ కౌన్సిల్ సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక కొవ్వూరులో నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు చెప్పారు. శనివారం కొవ్వూరులోని హోలీ ఏంజెల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి కెఎస్.జవహర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని దుర్గారావు తెలిపారు.

పెరవలి తహశీల్దారుగా సుధ

ప్రజాశక్తి-పెరవలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెరవలి తహశీల్దారుగా కృష్ణా జిల్లా ముసునూరు మండలానికి చెందిన డి.సుధ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన తలారి రాజేశ్వరి బిక్కవోలు మండలానికి బదిలీపై వెళ్లారు.

58 నెలలైనా నిర్మాణం కాని డ్రైనేజీ

ప్రజాశక్తి-బిక్కవోలు

కొంకుదురులో సిసి డ్రెయిన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి 58 నెలలైనా పూర్తి కాలేనందుకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకష్ణారెడ్డి వనూత్నం నిరసన తెలిపారు. శిలఫలకానికి పసుపు నీళతో, పాలతో అభిషేకం చేసి, మామిడి తోరణాలు కట్టి, కొబ్బరికాయలు కొట్టి పూజ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిసి డ్రైనేజీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి 58 నెలలు అవుతున్న దాన్ని నిర్మించకపోవడం స్థానిక ఎంఎల్ఎ అసమర్థతకు నిదర్శనమని చెప్పారు.

కబడ్డీ పోటీల్లో విజేత చిక్కాల టీమ్

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చిక్కాల–1 గ్రామ సచివాలయం ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్టు గ్రామ సర్పంచ్ కోయ మణి తెలిపారు. ఎంపిడిఒ పాతూరి నిర్మల కుమారి, సర్పంచ్ మణి, సొసైటీ అధ్యక్షులు సుంకర్ రాయుడు అభినందనలు తెలిపారు.

సుబ్బలక్ష్మి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి – నిడదవోలు

మండలంలోని పురుషోత్తపల్లిలో సుబ్రహ్మణ్యం నాయనమ్మ కొడమంచిలి సుబ్బలక్ష్మి ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని టిడిపి నాయకులు కుందుల సత్యనారాయణ పరామర్శించారు. వారికి సానుభూతి తెలిపారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

ఏప్రిల్ 16 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఎపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డివివి.త్రినాథ్ తెలిపారు. స్థానిక రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో అత్తి సత్యనారాయణ, బాలు, మద్దూరి శంకర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక నారాయణపురంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పాల్గొంటారని తెలిపారు.

'సిద్ధం' సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం ఏలూరులో సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు రాజమండ్రి నుంచి భారీగా వైసిపి శ్రేణులు కదిలి వెళ్లాయి. నగరంలోని విఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణం నుంచి బస్సులు, కార్లను ఎంపీ భరత్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమండ్రి లోక్‌సభ వైసిపి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. **పెరవలి** మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు కార్యకర్తలు బస్సులు, కార్లలో భారీగా తరలి వెళ్లారు ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్, జెడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజిని, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, పొట్టి రాంబాబు, వీరమల్లు సత్యనారాయణ, పసలపూడి భద్రయ్య, దొడ్డిగర్ల స్వాతి, బాలకృష్ణ, రామడుగుల సూర్యనారాయణ తదితరులు తరలి వెళ్లారు. **చాగల్లు** ఎంపిపి మట్ట వీరాస్వామి, వైసిపి మండల అధ్యక్షుడు దుర్గా మల్లేశ్వరరావు, జట్టా ఏడుకొండలు, ఆత్కూరు దొరయ్య, గారపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. **గోకవరం** భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలం నుండి 20 బస్సులు, 25 కార్లలో సుమారు రెండు వేల మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు జగ్గంపేట వైసిపి ఇన్‌ఛార్జి తోట నరసింహం బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. సుంకర వీరబాబు, పాటి రాంబాబు, వరసాల ప్రసాద్, కర్రి సురారెడ్డి, గుల్లా ఏడుకొండలు, సర్పంచ్ దాసరి చిన్నబాబు, నరాలశెట్టి నరసయ్య, వేర్ల వెంకటేశ్వరరావు, అక్షింతల రాజా, తోలేటి రమ్యశ్రీ ప్రసాద్, కర్రి శివరామకృష్ణ పాల్గొన్నారు. **తాళ్లపూడి** వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, తోట రామకృష్ణ, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు తదితరులు ఆధ్వర్యాన వైసిపి శ్రేణులు సిద్ధం సభకు తరలి వెళ్లారు.



గోకవరంలో తరలి వెళుతున్న నాయకులు

బిసిలు జగన్ వెంటే : డాక్టర్ సత్యగిరి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

బిసిలు జగన్ వెంటే ఉన్నారని బిసి సెల్ కార్యదర్శి డాక్టర్ చొల్లంగి సత్యగిరి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు బిసిల పార్టీ అని చెప్పుకుని టిడిపి అధినేత చంద్రబాబు బిసిలును ఎప్పుడూ కులవృత్తులు చేసుకునే వారిలాగే చూశారని, కానీ వైఎస్.జగన్ మాత్రమే మొట్టమొదటిసారిగా బిసిలకు పెద్దపీట వేసి అధిక సంఖ్యలో బిసిలను రాజ్యాధికారం దిశగా నడిపిస్తున్నారని చెప్పారు. సిఎం వైఎస్ జగన్ మాత్రమే అధిక సంఖ్యలో రాజ్యసభకు బిసిలను పంపారని చెప్పారు. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానాన్ని గత సార్వత్రిక లోక్సభ ఎన్నికల్లో బిసిలకు కేటాయించారని, ఈసారి కూడా బిసిలకే కేటాయించారని గుర్తు చేశారు.

ఎంపిడిఒ నరేంద్రరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి – ఉంగ్రాజవరం

ఉంగ్రాజవరం ఎంపిడిఒగా కె.నరేంద్ర రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం నుంచి సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఉంగ్రాజవరం వచ్చారు. ఆయనకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు స్వాగతం పలికారు.



సామగ్రిని ప్రారంభిస్తున్న ఎంఇఒ లజపతిరాయ్



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, మెడికోలు

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

క్యాన్సర్ నివారణ కోసం సంరక్షణ అంతరాన్ని అధిగమిద్దాం నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.సౌభాగ్య లక్ష్మి అన్నారు. శనివారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో క్యాన్సర్ అవగాహన ర్యాలీలో మెడికోలు, వైద్యులు, ఇతర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2022లో 14 లక్షలకు పైగా కొత్త కేసులు వెలుగు చూసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడించాయన్నారు. ఆ కారణంగా 9 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా మరణాల రేటును గణనీయంగా తగ్గించడం సాధ్యన్నారు. పురుషుల్లో పెదవి, నోరు, ఊపిరితిత్తులు, అన్నవాహిక క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్), అండా శయానికి సంబంధించిన క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. అత్యధిక మరణాలకూ ఈ రకాలే కారణమైనట్టు డబ్ల్యుహెచ్‌ఒ గుర్తించిందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, క్రమంతప్పక వ్యాయామం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. ర్యాలీలో డాక్టర్ కెవి.ఫణి మాధవీ, డాక్టర్ వి.సూర్యా రావు, డాక్టర్ ఆర్.సురేంద్ర బాబు, డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ జి.స్రవంతి, శ్రీనివాసమూర్తి, శివ ప్రసన్న, పేరయ్య శాస్త్రి, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుళ్లలో బోధనాభ్యసన సామాగ్రి ప్రారంభం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ళ నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ లజపతి రాయ్ శనివారం బోధన అభ్యసన సామాగ్రిని ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం గెడ్డం ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అమెరికాలో వైద్య వృత్తి చేపట్టిన ప్రవాస భారతీయులు డాక్టర్ గోరంట్ల వాసుబాబు పాఠశాలకు సుమారు రూ.30 వేల విలువ చేసే సామగ్రిని అందించారు. విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు ఈ సామాగ్రి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. పాఠశాల పట్ల దాతత్వాన్ని కనబరిచిన గోరంట్ల వాసు బాబుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ–2 ఏడిద నాగేశ్వరరావు, మురమండ హైస్కూల్ హెచ్ఎం బి.సుధ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దొరబాబు సుశీల, రాముడు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎంఎల్ఎ గోరంట్ల చెప్పేవి అవాస్తం : ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమండ్రి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అభివృద్ధి పనులపై అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం నగరంలోని విఎల్.పురం మార్గాని ఎస్టేట్స్‌లోని తన కార్యాలయంలో ఎంపీ మీడియాతో మాట్లాడారు. మోరంపూడి ఫ్లయ్ ఓవర్, నగరంలో ఆరు ఎఫ్ఒబిలు, ఔటర్ రింగ్ రోడ్ మంజూరు విషయంలో ఎంఎల్ఎ గోరంట్ల మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలన్నారు. వాస్తవమని గోరంట్ల నిరూపిస్తే మీడియా సాక్షిగా బహిరంగంగా ఆయనకు క్షమాపణలు చెబుతానని, లేదంటే గోరంట్ల తప్పు ఒప్పుకుంటారా అని ఎంపీ భరత్ సవాల్ విసిరారు. నగరంలో నిర్మిస్తున్న మోరంపూడి ఫ్లయ్ ఓవర్ వంతెనకు 35 స్తంభాలు ఉండాలా, వాటి డిజైన్ మార్చామా, అసలు గోరంట్ల ఎఫ్ఒబి డిజైన్ చూసే మాట్లాడుతున్నారా అని ఎంపీ ప్రశ్నించారు. నేషనల్ హైవే అధికారుల సంతకంతో అప్రూవ్డ్ డిజైన్ ఉంటే చూపిస్తే తాను క్షమాపణ చెబుతా అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు కొన్ని సాంకేతిక కారణాలతో ఆగిందని, భవిష్యత్తులో తప్పక పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కడియం

మురమండ గ్రామ శివారు రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్నపేకాట శిబిరంపై శనివారం తెల్లవారుజామున కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ అశ్ఫాక్ తమ సిబ్బందితో జరిపిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఐదుగురు పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఘటన స్థలంలో ఒక కారు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణిలు, రూ.5,880లు నగదు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా పేకాడుతూ తప్పించుకున్న మరో ఐదుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన ఇఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలీస్ లైన్ ఆవరణలోని 14, 15, 16 పోలింగ్ స్టేషన్లకు వెళ్లిన ఆయన అక్కడి సదుపాయాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై ఆయన అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎఇఆర్ఒలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.10 వేలు చొప్పున వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ బి.అబ్బాయికి వారు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కోరాడ రాము మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా మిడ్డే మీల్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలని, పని భద్రత కల్పించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు, అమరావతి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, గంగాభవాని, వై సత్యవతి, కే నాగరత్నం, జి అప్పలరాజు పాల్గొన్నారు.

సాగునీటి వనరులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్లో రబీ సీజన్లో సాగునీరు పంపిణీ ఇతర అంశాలపై జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య ఇరిగేషన్, వ్యవసాయ, డ్రైయిన్స్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి ఆయకట్టు, ఏలేరు ఆయకట్టు, పంపా రిజర్వాయర్ కింద సాగుతున్న పంటల వివరాలు, సాగునీటి లభ్యత, కాలువల పరిస్థితులపై ఆయన ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు.

జెసి ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలోని నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ రబీ సీజన్లో రైతులకు ప్రణాళిక ప్రకారం సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు ఇరిగేషన్, వ్యవసాయ, డ్రైయిన్స్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో నూరు శాతం వరి నాట్లు ప్రక్రియ పూర్తయిందని, గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద 53వేల ఎకరాలు, పంపా రిజర్వాయర్ కింద సుమారుగా 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు జెసి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం ఈ - క్రాప్ బుకింగ్ పూర్తయిందని, మిగిలిన రైతుల నుంచి కూడా ఈ-క్రాప్ బుకింగ్ వివరాల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ధవలేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్ఇ జి.శ్రీనివాస రావు, పెద్దాపురం ఇఇ డి.రాంగోపాల్, రామచంద్రపురం ఇఇ వి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మేకపై జంతువు దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో శనివారం తెల్లవారుజాము ప్రాంతంలో మేకపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి సగం కళేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఇప్పటికే గ్రామంలో క్షుద్ర పూజలు జరుగుతున్నాయని ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకున్న సమయంలో సగం మేక కళేబరం కనబడటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సమీపంలో నివసించే షేక్ భాషాకు చెందిన మేకపై గుర్తుతెలియని జంతువు దాడి చేసి సగం మాంసాన్ని తినేసి మేక కళేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఉదయం గ్రామస్తులు ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఇది జంతువు పనేనా?ఎవరైనా వ్యక్తులు కావాలనే ఇలా చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

కేంద్ర బడ్జెట్లో మొండి చేయి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మధ్యంతర బడ్జెట్లో జిల్లాకు పూర్తిగా మొండి చేయి తప్పలేదు. గత నాలుగేళ్లుగా ఊరిస్తూ ఉసూరు మనిపించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో తాయిలాలు ప్రకటించే అవకాశాలున్నాయని ఎదురు చూసిన వివిధ వర్గాల ప్రజలకు నిరాశే మిగిలింది. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పోటీ పడి మద్దతు తెలపడమే ఈ దుస్థితికి కారణమని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు ప్రతి జిల్లాకు ఒక ఎయిర్ పోర్టు అని వైసిపి అధినేత చెప్పిన విషయం విదితమే. కొత్త ఎయిర్పోర్టులు లేకపోగా రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు అభివృద్ధి ఆచరణలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కీలకమైన రైల్వే ప్రాజెక్టుల్లోనూ పురోగతి కరువైంది. పోలవరం ప్రాజెక్టుకు కేటాయింపులపైనా తాత్సారం తప్పలేదు. కాకినాడ పిఠాపురం ప్రధాన రైలు మార్గం అనుసంధానానికి గతంలో కేటాయించిన బడ్జెట్కు నామమాత్రపు కేటాయింపులు నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా మారింది. కేవలం వెయ్యి చొప్పున కేటాయించడం విమర్శలకు దారి తీసింది. కోటిపల్లి- నర్సాపురం రైలు మార్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం నిధుల లేమి వెంటాడుతోంది. రాష్ట్రం మీ వల్ల అంటే మీ వల్ల అప్పుల పాలైందని ఇటు అధికార వైసిపి, అటు టిడిపి విమర్శలు చేసుకుంటున్నాయే గానీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన నిధులను సాధించడంలో చిత్తశుద్ధి కరువైంది. కనీసం ప్రజల కోసం అయినా కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకించక పోవడం ప్రజలను ఆలోచింపచేస్తోంది.

టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ

టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికార వైసిపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు చక చకా ఏర్పాట్లు చేయడంతో ప్రతిపక్ష నేతల్లో కలవరం వ్యక్తమవుతోంది. వైసిపి ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాలతో పాటు పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జిలను ప్రకటించి వారే అభ్యర్థులను చెప్పకనే చెప్పింది. ఐ పాక్ సర్వేల ఆధారంగా సిట్టింగ్లకు స్థాన చలనం చేసి కొత్త స్థానాల్లో అదృష్టాన్ని పరీశించుకోవాలని తేల్చిచెప్పింది. దీంతో అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం ప్రారంభించేశారు. పరోక్షంగా తమను గెలిపించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేసి తిరిగి అధికారంలోకి వస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి జాబితా ఇప్పటికీ విడుదల చేయలేదు. దీంతో అనేక నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గం ఎవరికి కేటాయిస్తారనే గందరగోళం నెలకొంది. టిడిపి జనసేన నేతల అంతర్యుద్ధానికి ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన రా కదలిరా సభ వేదికైంది. అధినేత ముందే రాజానగరంలోని టిడిపి, జనసేన నేతలు వాగ్యుద్ధానికి దిగటం విమర్శలకు దారి తీసింది.

విమర్శలకు దారి తీసిన పరీక్షల వాయిదా

వైసిపి నిర్వహించిన సిద్ధం కార్యక్రమం కోసం ఇంటర్మీడియెట్ పరీక్షను వాయిదా వేయటం విమర్శలకు దారి



తీసింది. ఏలూరులో శనివారం నిర్వహించిన సభకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాజరైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేయటంతో పాటు ఆర్టిసి బస్సులను సైతం సభకు తరలించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని వైసిపి నేతలు తమ తమ నియోజక వర్గాల నుంచి ప్రజలను తరలించి అధినేత ఆశీస్సులు పొందేందుకు పోటీ పడ్డారు. ప్రజల ప్రయాణ అవసరాలను పక్కన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తూ నిర్వహించే ఇటువంటి సభలు ఏ మేరకు సహాయపడతాయో వేచి చూడాలి.

ఓట్ ఫర్ ఒపిఎస్ సభ విజయవంతం

ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నిర్వహించిన ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమం విజయవంతమైంది. సుమారు 3 వేల మంది వస్తారని అంచనా వేయగా 7 వేలకు పైగా ఉపాధ్యాయులు హాజరవటంతో ఎస్కెవిటి డిగ్రీ కళాశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికార వైసిపితో పాటు, ప్రతిపక్ష టిడిపి నుంచి ఒపిఎస్పై ఎటువంటి హామీ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్లు ప్రకటించారు.

కేంద్ర బడ్జెట్ తప్పుదోవ పట్టించేలా ఉంది

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

కేంద్ర బడ్జెట్ తప్పుదోవ పట్టించే విధంగా ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర హాల్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 41 శాతం సంపద అంబానీ, ఆదానీ దగ్గర ఉన్నట్లు ఎక్స్ ఫార్మ్ వాళ్లు ఇచ్చిన లెక్కలు చెబుతున్నాయన్నారు. దీన్ని లెక్కలోకి తీసుకుని దారిద్ర్యం నిర్మూలన అయినట్లు చెబుతున్నారా అని ఆయన ప్రశ్నించారు బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను జబ్బు పడిన రాష్ట్రాలుగా బీమార్ అని పిలుస్తారని, మొత్తం అన్ని రాష్ట్రాలకూ రూ.12 లక్షల కోట్లు కేంద్రం పంచుతుంటే, ఈ నాలుగు రాష్ట్రాలకే నాలుగు లక్షల కోట్లు ఇస్తున్నారని అన్నారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ రాష్ట్రాల నుంచి కేంద్రానికి రూపాయి చొప్పున వెళ్తుంటే, తిరిగి ముప్పావలా చొప్పున మాత్రమే వస్తుందని, అదే బీమార్ రాష్ట్రాలకు రూపాయి చెల్లిస్తే, రూపాయి కన్నా ఎక్కువ వెళ్తుందని ఆయన వివరించారు. ఇక జనాభా నియంత్రణలో కూడా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల ఇటు జనాభా తగ్గి, ఉత్తరాది వైపు జనాభా పెరిగిందని, ఇందుకు దక్షిణాది రాష్ట్రాలకు ఇన్సెంటివ్స్ ఇవ్వడానికి బదులు తక్కువ కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాదిన సీట్లు గణనీయంగా పెరుగుతాయని, ఇప్పుడే కేటాయింపుల విషయంలో వ్యత్యాసం ఉంటే, రేపొద్దున పంపిణీలో చాలా వివాదాలు వస్తాయని ఆయన విశ్లేషించారు. రాష్ట్రం మీ వల్ల అంటే మీ వల్ల అప్పులపాలైందని ఇటు అధికార వైసిపి, అటు టిడిపి విమర్శలు చేసుకుంటున్నాయే గానీ రూ.కోటి కోట్ల మోడీ హయాంలో పెరిగిన విషయం ఏ పార్టీ ప్రస్తావించకుండా రెండు పార్టీల ఎంపీలు బిజెపికే మద్దతుగా ఉంటున్నారని ఆయన విచారం వ్యక్తం చేసారు. కనీసం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్కుమార్

ప్రజల కోసం అయినా కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకించక పోవడం దారుణమన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్లో చేరడంపై చర్చ అనవసరమని ఉండవల్లి చెప్పారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ సిఎంగా పని చేశారని, ఆయన కుమార్తె కాంగ్రెస్లోకి వెళ్తే తప్పేమిటని ప్రశ్నించారు. ఇది కుటుంబాన్ని చీల్చడం ఎలా అవుతుందన్నారు.

హైస్కూల్కు కంప్యూటర్ సామగ్రి అందజేత

ప్రజాశక్తి -గోపాలపురం

నాణ్యత ప్రమాణాలతో పాటు సాంకేత పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలని పాఠశాల దాత హోతా రాజాబాబు అన్నారు. శనివారం మండలంలోని హుకుంపేటలోలో హైస్కూల్కు రూ.80 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్లను ఆయన అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బిక్కవోలు నాగేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం వెంప అచ్యుత మోహన్రావు మాట్లాడుతూ పాఠశాల అభివద్ధికి దాతలు రాజాబాబు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాజాబాబు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక పరిజ్ఞానం విద్యను అందించాలని, విద్యార్థులలో జ్ఞాపకశక్తి మెరుగు పరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి హెచ్ఎం బి.విశ్వనాథం, వైస్ సర్పంచ్ రావిపాటి శేషారావు పాల్గొన్నారు.

స్త్రీ పురుష లింగ నిష్పత్తిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్త్రీ పురుష లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలలో పై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పిసిపిఎన్డిటి చట్టం అమలుపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. డెకాయ్ ఆపరేషన్ చేసే సమయంలో హాస్పిటల్స్ వారికి తెలియకుండా వెళ్లి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించాలన్నారు.

ఈ తనిఖీల సమయంలో స్థానిక పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల సిబ్బంది ఉండాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్ రాజకుమారి జిల్లాలో యాక్ట్ పరిధిలో రిజిస్టర్ అయిన స్కానింగ్ సెంటర్లపై మీటింగ్ అజెండాను వివరించారు. జిల్లాలో 148 స్కానింగ్ సెంటర్లో ఉన్నాయని కొత్తగా మూడు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కోసం, ఆరు రెన్యువల్ కోసం, మూడు మోడిఫికేషన్ కోసం అనుమతుల కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.వసుంధర, జిల్లా స్త్రీ శిశ సంక్షేమ అధికారి కె.విజయ్ కుమారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐసి శంభు ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఒలు శ్రీహరి, సంధ్య పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, జీవశాస్త్ర విభాగం, కాకినాడ మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. క్యాంపస్ ఇన్ఛార్జ్ ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యవంతమైన యువత వలన ఆరోగ్యభారత నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ మరియు పీజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, క్యాంపస్ ఇన్ఛార్జ్ ఎన్.మూర్తి మాట్లాడారు. బయోసైన్స్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆహ్వానితులు తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, జీవశాస్త్ర శాఖధిపతి డాక్టర్ బి.శ్రీను, వి అనిల్, డి.మాధవి రత్నప్రియ, శ్రీనిహారిక, హర్షిత, కెజిఎల్.సుభాషిని తదతరులు పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, డీన్లు డాక్టర్ ఎ.రామకృష్ణ, డాక్టర్ సిహెచ్.రాఘవేంద్రన్, ఎన్ఎస్-ఎస్ పిఒ చిట్టూరి రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడరూరల్** స్థానిక మెడికవర్ హస్పటల్లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అనగానే ముందు మనం భయపడటం సహజం, కానీ సరైన సమయంలో మనం చికిత్స అందిస్తే మనం వారికీ పునర్జన్మని అందించినవాళ్ళం అవుతామని అన్నారు.

మెగా కాదు దగా డిఎస్సి

ప్రజాశక్తి -నల్లజర్ల

సిఎం వైఎస్.జగన్ వదిలింది మెగా డిఎస్సి కాదు దగా డిఎస్సి అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్ఛార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,890 ఉపాధ్యాయ పోస్టులను గుర్తించగా కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మరోసారి వంచించడమే అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డిఎస్సి పేరుతో జగన్ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు.

రవ్వ ప్లాంట్ వద్ద కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఎస్.యానాంలో ఉన్న వేదాంత ఆయిల్ కంపెనీ గ్రామ అభివద్ధిని విస్మరించి గ్రామ ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ నిరుద్యోగ యువత,గ్రామస్తులు ఆందోళన రెండో రోజు శనివారం రాత్రి వరకూ కొనసాగింది. ప్లాంటు గేటు వద్దకు వెళ్లే ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి కార్మికులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అమలాపురం డిఎస్పి ఆదేశాల మేరకు రూరల్ సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ కెఎన్.జోషి ఆందోళనకారులపై కేసులు నమోదు చేశారు. ఆందోళనలో విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఓట్ఫర్ ఒపిఎస్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమలాపురం

సిపిఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అలా అమలు చేసే వారికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో మా కుటుంబాల మద్దతు ఉంటుందని కార్యాచరణలో భాగంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం అమలాపురం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఎం టివి సుబ్బారావు ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎవరైతే ఒపిఎస్ అమలుకు స్పష్టమైన హామీ ఇస్తారో ఆ పార్టీకే ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాల మద్దతు ఉంటుందన్నారు. ఒపిఎస్ పునరుద్ధరణ పై మేనిఫెస్టో లో చేర్చి పార్టీ వైఖరిని బహిరంగంగా ప్రకటించాలన్నారు.

వ్యాపార సంస్థలన్నీ లైసెన్సులు పొందాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య, వ్యాపార, సంస్థలు విధిగా ఈ నెల 29వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికేట్ పొంది ఉండాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం.వల్లి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో ద ఛాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు, యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లి మాట్లాడుతూ ఎపి దుకాణాలు, సంస్థల చట్టం-1988, మరియు పలు చట్టాల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఆయా సంస్థలన్నీ విడి విడిగా కాక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 2015 కింద కార్మిక చట్టలన్నిటికీ ఒకే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, లైసెన్సు పొందే వెసులుబాటు ఉందని తెలిపారు. ఇది వరకే కార్మిక చట్టాల క్రింద రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థలు వాటి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 29వ తేదీలోపు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు.

రైల్వే లైన్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ వేగవంతంగా పూర్తి చేయాలని జిఎంసి.బాలయోగి సాధన సమితి నాయకులు ఉంగరాల వెంకటేశ్వ రరావు అన్నారు.స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ ప్రవేశపెట్టిన నూతన రైల్వే బడ్జెట్లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వేలైన్ మరమ్మతులకు రూ.10 కోట్లు, కోటిపల్లి నుంచి నరసాపురం వరకూ రూ.300 కోట్లు నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులోకి తీసుకురా వాలన్నారు. ఈ సమావేశంలో సాధన సమితి నాయకులు నాగిడి నాగేశ్వరరావు, అరిగిన బలరామ మూర్తి, కర్రి రామస్వామి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగములో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. రెండవ రోజు యూనివర్సిటీ అఫ్ పెట్రోనస్, మలేషియాలో అసోసియేట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇరైవన్ ఇలమ్ వరుతీ ఆన్లైన్లో ఇంటిలిజెన్స్ పరిశోధన విభాగంలో మెలకువలని వివరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్. రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.10 వేలు చొప్పున వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ బి.అబ్బాయికి వారు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కోరాడ రాము మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా మిడ్డే మీల్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలని, పని భద్రత కల్పించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు, అమరావతి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా మానసిక వికాసం

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం కూడా సిద్ధిస్తుందని డిఎస్పి లతాకుమారి అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్లో గత రెండు రోజులుగా నిర్వహించిన భాష్యం స్పోర్ట్స్ మీట్ శనివారం సాయంత్రం ముగిసింది. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వా లన్నారు. అనంతరం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. భాష్యం జోనల్ ఇన్ఛార్జ్ గోవిందరాజు మాట్లాడుతూ 5 భాష్యం బ్రాంచీలకు చెందిన బాలికలు వివిధ పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ జి.నళిని, ప్రిన్సిపల్స్ గోవిందరాజు, చంద్రశేఖర్, వేణు, అనిల్, సూర్యారావు, ప్రైమరీ ప్రిన్సిపల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No. 1/2024

Between:

బుద్దా వేణుగోపాలస్వామి *-పిటీషనర్*

AND

1. కన్ని పార్వతి
2. కన్ని శ్రీకృష్ణ సత్య వెంకటరమణ
3. వీర్ల వెంకటరమణ
4. కర్ణం బూరయ్య
5. గూడుపు కుమారి
6. గూడుపు మణికంఠ
7. ఘాటినేని సురేష్
8. సరకనం రామారావు
9. మల్లా కృష్ణ
10. కర్రి కొండలరావు
11. రౌతుల వెంకట సురేష్
12. బుక్కా వీరభద్రరావు (బద్రి)
13. మాదారపు అశోక్
14. కాళ్ళ గోవింద్ *-రెస్పాండెంట్స్*

పై నెంబర్ కేసుని పిటిషనర్ తనని ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని కోరుతూ రెస్పాండెంట్లు అయిన మీపై దాఖలు చేసియున్నారు. సదరు కేసులో ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ **ది. 14-02-2024వ సం॥ము తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై తెలియపరచుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

//By Court Order//

నరహరిశెట్టి రవికృష్ణ
దూళ్ల మల్లేశ్వరరావు
ఎం.ఎ.ఎల్.సరస్వతి
అడ్వకేట్స్, డో.నెం. 35-4-1,
దేవాలయం వీధి, కాకినాడ
సెల్: 90101 77599

పేరు మార్పు

నేను **ముప్పడి తెరెసమ్మ** (కొత్త పేరు), W/o. సూర్యరావు, పూర్వం **ముప్పడి సరోజిని** (పాత పేరు) అని పిలవబడేదాన్ని. డోర్ నెం. 13-12-105, ఇందిరా నగర్, నిడదవోలు టౌన్. ఇక నుండి నా పేరు **ముప్పడి తెరెసమ్మ** అని పిలవబడుతుంది.

ముప్పడి తెరెసమ్మ
W/o. సూర్యరావు
డోర్ నెం. 13-12-105, ఇందిరానగర్
నిడదవోలు టౌన్, తూర్పుగోదావరి జిల్లా

ప్రకటన



కీ॥శే॥ చింతలపూడి రామకృష్ణయ్య (లేటు)

ఆంధ్రప్రదేశ్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, పశువుల్లంక గ్రామ కాపురస్తులు చింతలపూడి సత్యనారాయణమూర్తి తెలియజేయునది ఏమనగా,

నా తండ్రి గారైన **కీ॥శే॥ చింతలపూడి రామకృష్ణయ్య**, S/o. చిట్టన్న ది. 17-10-2016 సం॥ తేదీన స్వర్గస్థులైనారు. నా తండ్రి గారికి ముగ్గురు కుమారులు అయివున్నాము. కావున సదరు ఎవరికైనను ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ తేదీ లగాయితు 10 రోజులలో తెలియపర్చగలరు.

ఇట్లు: చింతలపూడి సత్యనారాయణమూర్తి
ఇంటి నెంబర్: 4-15/3, పశువుల్లంక
ఐ.పోలవరం మండలం, పిన్ నెంబర్: 533220
సెల్: 9493279919

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District

M.V.O.P. No. 52/2022

Between:

Peddireddy Raju ***...Petitioner***

AND

Kada Siva Srinivas and Others ***...Respondents***

Notice to Respondent:

R-3: Anivilla Venkata Satya Surya Ravi, S/o. Subrahmanya Sharma, Hindu, age not known, D.No. 62-1-29/A, Market Street, Jagannaickpur, Kakinada, E.G.Dt., Pin: 533002 (Insured of Maruti Swift Dzire Car bearing Regd. No. AP 31 DB 3222)

In the above M.V.O.P. No. 52/2022 the 3rd Respondent hearing date stand posted to **12-02-2024 at 10.30 AM** before the 2nd Additional Dsitrict and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing Date: 12-02-2024

N.RAJASEKHAR
Amalapuram — Advocate, Amalapuram
Dt: 03-02-24 — Cell: 9849193665

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District

M.V.O.P. No. 198/2014

Between:

Pechetti Ramakrishna and Others ***...Petitioners***

AND

Muthabathula Musalayya and Others ***...Respondents***

Notice to Respondent:

R-1: Muthabathula Musalayya, S/o. Naganna, Hindu, age 48 years, Aravacheruvu Devaguptam, Allavaram Mandal, E.G.Dt. (Driver of Tractor bearing Regd. No. AP 37 U 3134)

In the above M.V.O.P. No. 198/2024 the 1st Respondent hearing date stand posted to **16-02-2024 at 10.30 AM** before the 2nd Additional Dsitrict and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing Date: 16-02-2024

N.RAJASEKHAR
Amalapuram — Advocate, Amalapuram
Dt: 03-02-24 — Cell: 9849193665

ప్రకటన

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 7/2022 in **O.S. 169/2018**

Between:

సత్తి వీర వెంకట సత్యనారాయణరెడ్డి, S/o. లేటు వెంకటరెడ్డి, హిందు, వయస్సు 41 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 1-44, పొలమూరు గ్రామము, అనపర్తి మండలం, అనపర్తి JCJC. ***...DHR/ వాది***

AND

1) చిగిల్లిపల్లి పైడునాయుడు, S/o. పోతినాయుడు, హిందు, వయస్సు 59 సం॥లు, వ్యాపారము, డో.నెం. 5-9-29, ఆంధ్రాబ్యాంక్ వీధి, తర్వాణిపేట, మండపేట టౌన్, మండపేట మండలం, ఆలమూరు JCJC.

2) చిగిల్లిపల్లి కళ్యాణి, W/o. పైడునాయుడు, హిందు, వయస్సు 51 సం॥లు, హౌస్ వైఫ్, డో.నెం. 5-9-29, ఆంధ్రాబ్యాంక్ వీధి, తర్వాణిపేట, మండపేట టౌన్, మండపేట మండలం, ఆలమూరు JCJC. ***...JDRs/ ప్రతివాదులు***

పై నెంబరు అమలు గ్రంధములో సేల్ నోటీసులో JDRs హాజరు నిమిత్తం **ది. 01-03-2024 సం॥ తేదీని ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

వాయిదా: 01-03-2024

T.VIJAYA KUMAR
మండపేట — Advocate for DHR
03-02-2024 — సెల్: 9949135866